www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

కోదాడ నియోజకవర్గంలో భూముల రీ–సర్వేకు సన్నాహాలు



3 లో..

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుంది



3 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 300, శనివారం 28-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



డీలిమిటేషన్‌పై కేంద్రం కీలక సవరణలు

- అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య 50 శాతం పెంపు
- 2051 వరకు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తి కొనసాగింపు
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు కొత్త ప్రతిపాదనలు
- నవంబర్ 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 27

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, డీలిమిటేషన్ తర్వాత ఏ రాష్ట్రానికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుత మున్న పార్లమెంటరీ ప్రాతినిధ్య నిష్పత్తి తగ్గకుండా రాజ్యాంగ సవరణ బిల్లులో మార్పులు ప్రతిపాదించింది. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను ప్రస్తుత సంఖ్యతో పోలిస్తే 50 శాతం పెంచి, రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 2051 వరకు కొనసాగించే ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం సేవాతీర్థ్‌లో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగింది.

కొత్త ప్రతిపాదన ప్రకారం ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచనున్నారు. రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిని 2051 వరకు యథాతథంగా కొనసాగించేలా నిబంధనలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

మిగతా 2 లో..

మహిళలకు 33% రిజర్వేషన్లు ఖాయం

- మహిళా కోటాపై అమిత్ షా కీలక ప్రకటన
- రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి విమర్శలు
- యూసీసీ అమలుకు బీజేపీ ప్రభుత్వాల సిద్ధత



న్యూఢిల్లీ, నవంబర్ 27 :

పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కానీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కానీ మహిళా రిజర్వేషన్ల అమలు ప్రక్రియను అడ్డుకోలేరని తేల్చి చెప్పారు. దేశంలోని మహిళలకు తప్పకుండా 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈ లక్ష్య సాధనకు పూర్తిగా కట్టుబడి ఉందని వెల్లడించారు. ఢిల్లీలో నిర్వహించిన 'సంవిధాన్ గౌరవ్ దివస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ విలువలు, దేశ రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. గత ఏప్రిల్‌లో 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి, మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయాలనే ఉద్దేశంతో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తుచేశారు. అయితే ఈ బిల్లుకు విపక్షాలు అడ్డంకులు సృష్టించాయని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించే ప్రయత్నాలను అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ వైఖరిని బయటపెట్టుకున్నాయని ఆరోపించారు. నవంబర్ 30 నుంచి పార్లమెంట్ సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల అంశంపై అమిత్ షా చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళలకు హక్కులు కల్పించే విషయంలో తమ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయంతో ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ప్రదర్శించినంత మాత్రాన దానిని గౌరవించినట్లు కాదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అమిత్ షా

మిగతా 2 లో..



మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి..

లక్ష్యమే వ్యసనంగా మారాలి

యువతకు మెగాస్టార్ చిరంజీవి పిలుపు

నషా ముక్త్ భారత్ పాదయాత్ర ముగింపు వేడుకల్లో సందేశం

హైదరాబాద్, నవంబర్ 27 :

యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్న మత్తుపదార్థాల మహమ్మారిని సమష్టిగా ఎదుర్కోవాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుపదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. మత్తుపదార్థాలకు బానిసలయ్యే బదులు తమ జీవిత లక్ష్యాన్నే ఒక వ్యసనంగా మార్చుకోవాలని హితవు పలికారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర ముగింపు వేడుకలకు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలు యువత జీవితాలను మాత్రమే కాకుండా వారి కుటుంబాలను సైతం తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు స్నేహం పేరుతో తెలియకుండానే యువతను వ్యసనాల వైపు మళ్లించే ప్రయత్నం చేస్తారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును నిర్మించుకునే దిశగా అడుగులు వేయాలని అన్నారు.స్నేహితుల్లో ఎవరైనా మత్తుపదార్థాలకు బానిసలైతే వారిని ద్వేషించకుండా, స్నేహభావంతో దగ్గర తీసుకోవాలని చిరంజీవి సూచించారు. మంచి మాటలు, ఆప్యాయతతో వారిలో మార్పు తీసుకొచ్చి వ్యసనాల నుంచి బయటపడేలా ప్రయత్నించాలని కోరారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని విద్య, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవ వంటి రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మత్తుపదార్థాల నిర్మూలన ఒక్క ప్రభుత్వంతోనే సాధ్యమయ్యే పని కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సామాజిక సంస్థలు, ప్రజలు సమష్టిగా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన నషా ముక్త్ భారత్ పాదయాత్ర యువతలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నమని అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చిరంజీవి తెలిపారు. యువత తమ శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని మెగాస్టార్ పిలుపునిచ్చారు.



విద్యుత్ రంగానికి కేంద్ర సహకారం కోరిన భట్టి విక్రమార్క

- *రాష్ట్ర విద్యుత్ అవసరాలపై కేంద్రానికి పలు ప్రతిపాదనలు*
- *రూ.25,096 కోట్ల ఆర్‌డీఎస్ఎస్ నిధుల ఆమోదానికి విజ్ఞప్తి*
- *పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులకు మద్దతు*
- *2030 వరకు పునరుత్పాదక విద్యుత్ ప్రసార ఛార్జీల మినహాయింపు కోరిన రాష్ట్రం*

న్యూఢిల్లీ, నవంబర్ 27



తెలంగాణ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్తు విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలోకేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ రంగానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, నిధుల అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం,

మిగతా 2 లో..

మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

- ఫ్లాట్‌లో విగతజీవిగా కనిపించిన సింధూజ
- జగిత్యాల జిల్లాకు చెందిన 36 ఏళ్ల మహిళ
- నాలుగు నెలలుగా మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు సూసైడ్ నోట్‌లో ప్రస్తావన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

2 లో..



www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
శనివారం
28 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

డీలిమిటేషన్‌పై కేంద్రం కీలక సవరణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ ఎన్నికైన సభ్యుల సంఖ్య ఈ పెంపుతో సుమారు 816కు చేరే అవకాశం ఉంది. రాజ్యాంగంలో గరిష్ఠ పరిమితిని 850 స్థానాలుగా ప్రతిపాదిస్తున్నారు. ఈ మార్పులతో జనాభా పెరుగుదల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగినా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య వాటా తగ్గకుండా చూడాలన్నది కేంద్రం ఉద్దేశంగా తెలుస్తోంది.

ఈ బిల్లుకు పార్లమెంటులో మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. ఏప్రిల్‌లో ప్రవేశ పెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మద్దతు పొందలేకపోవడంతో ఆమోదం పొందలేదు. ఈ నేపథ్యంలో తాజా ప్రతిపాదనల్లో అన్ని రాష్ట్రాల సీట్లను ఒకే నిష్పత్తిలో పెంచే అంశాన్ని చేర్చినట్లు వార్తలు వెలువడ్డాయి. డీఎంకేకు చెందిన 22 మంది, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం)కు చెందిన ఎనిమిది మంది ఎంపీల మద్దతు ఈ బిల్లు ఆమోద ప్రక్రియలో ప్రాధాన్యం సంతరించుకోనుంది. అయితే బిల్లు ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలం సభలో హాజరై ఓటు వేసే సభ్యుల సంఖ్యతో పాటు రాజ్యాంగంలోని ప్రత్యేక మెజారిటీ నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

ఈ నెల 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. నవంబర్ 30న లోక్‌సభ సమావేశం కాగా, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశం కానుంది. డిసెంబర్ 3 వరకు సభా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌లను కోరినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ సమావేశాల్లో కీలకమైన బిల్లులు, దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరగనున్నట్లు తెలిపారు. ప్రత్యేక సమావేశాల్లో సభ్యులందరూ సభా కార్యకలాపాల్లో నిర్మాణాత్మకంగా పాల్గొనాలని రిజిజు విజ్ఞప్తి చేశారు. ప్రపంచం భారత పార్లమెంటరీ వ్యవస్థను గమనిస్తోందని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా సభా సమావేశాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం అందరి సమష్టి బాధ్యతని అన్నారు. సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయవచ్చని, అయితే సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించే వ్యాఖ్యలు, చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన ప్రతిపాదనలు ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశముండటంతో కేంద్రం, విపక్షాల మధ్య చర్చలు కీలకం కానున్నాయి.

మహిళలకు 33% రిజర్వేషన్లు ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. రాజ్యాంగం పట్ల గౌరవం అనేది మాటల్లో కాకుండా వ్యక్తుల ప్రవర్తనలో, రాజకీయ వ్యవహారశైలిలో కనిపించాలని అన్నారు. న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై విమర్శలు చేస్తూ వాటి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఆరోపించారు. గతంలో దేశంలో అత్యవసర పరిస్థితిని విధించి సుమారు 18 నెలల పాటు రాజ్యాంగ హక్కులను నిర్బంధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే ముందు గతంలో ఆ పార్టీ వ్యవహరించిన తీరును గుర్తుచేసుకోవాలని సూచించారు.

బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింటిలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు చేసి తీరుతామని అమిత్ షా ప్రకటించారు. భారత రాజ్యాంగ రూపకర్తలు సైతం నిర్దేశక సూత్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని చేర్చారని గుర్తుచేశారు. మతం, కులం, వర్గంతో సంబంధం లేకుండా దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన చట్టం వర్తించేలా చర్యలు తీసుకోవడం తమ లక్ష్యమని వివరించారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, పార్సీలతో సహా అన్ని మతాల ప్రజలకు సమాన న్యాయ సూత్రాలు వర్తించే విధంగా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ విషయంలో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ సమగ్రత, భద్రతను బలోపేతం చేసేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామని అమిత్ షా వివరించారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దు, వామపక్ష తీవ్రవాదాన్ని నియంత్రించేందుకు చేపట్టిన చర్యలు, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి స్థాపన దిశగా సాధించిన పురోగతిని ప్రస్తావించారు. ఈశాన్య ప్రాంతాల్లో సుమారు 11 వేల మంది సాయుధులు ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవడం దేశ ఐక్యతకు బలాన్నిచ్చిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా దేశవ్యాప్తంగా 80 కోట్ల మంది పేదలకు ప్రయోజనాలు అందించామని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు, ఉమ్మడి పౌరస్మృతి, జాతీయ భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధికి, రాజ్యాంగ లక్ష్యాల సాధనకు దోహదపడతాయని అమిత్ షా వెల్లడించారు.

బీసీలకు చట్టసభల్లో 27 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి: ఈటల

- **ఇందిరా పార్క్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంపీ డిమాండ్**
- **అసెంబ్లీ, మండలి, పార్లమెంట్‌లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి**
- **విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల అమలులో లోపాలు సరిచేయాలి**
- **'ఎవరి వాటా మాకు అక్కర్లేదు.. మా వాటా మాకు కావాలి'**



హైదరాబాద్, నవంబర్ 27

: చట్టసభల్లో బీసీలకు రాజ్యాంగబద్ధంగా 27 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యంపై మాట్లాడారు. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ వర్గాలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కాలని, వారి చిరకాల డిమాండ్లను సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ సంస్థల్లో రిజర్వేషన్ల అమలులో పలుచోట్ల లోపాలు తలెత్తుతున్నాయని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయించుకోవడానికి బీసీలు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల భర్తీతో పాటు అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీ సమాజ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలితో పాటు పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాజ్యసభల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీసీ సమాజం ఏళ్ల తరబడి పోరాటం కొనసాగిస్తోందని, రాజకీయ నిర్ణయాల్లో తగిన భాగస్వామ్యం దక్కాలన్నది వారి ప్రధాన ఆకాంక్ష అని వివరించారు. 'ఎవరి వాటా మాకు అక్కర్లేదు.. మా వాటా మాకు కావాలి' అనే నినాదం బీసీ సమాజ సంకల్పాన్ని తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. తమకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటాను సాధించుకోవాలన్న లక్ష్యంతో బీసీలు ముందుకు సాగుతున్నారని తెలిపారు. జనాభాలో సగానికి పైగా ఉన్న వర్గాల ఆత్మగౌరవం, ఆకాంక్షలను ఈ రౌండ్ టేబుల్ సమావేశం ప్రతిబింబించిందని అన్నారు.

బీసీలకు 27 శాతం రాజకీయ రిజర్వేషన్ల డిమాండ్‌ను చట్టసభల్లో ప్రవేశపెట్టి, తప్పనిసరిగా అమలు చేయాలని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ, శాసనమండలి, పార్లమెంట్ ఉభయ సభల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే దిశగా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. బీసీల హక్కులు, వాటా, ఆత్మగౌరవానికి సంబంధించిన ఈ డిమాండ్‌ను సాధించే వరకు పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ భూ సర్వే

- **ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ రీసర్వే**



హైదరాబాద్, నవంబర్ 27

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న సమగ్ర భూ రీసర్వేను రానున్న ఏడాదిన్నరలో పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేసి, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా చేపడుతున్న ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో ప్రతి జిల్లాకు 70 గ్రామాల చొప్పున, మ్యాప్‌లు అందుబాటులో లేని 373 గ్రామాల్లో రీసర్వే చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఈ పనులను డిసెంబర్ చివరినాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వేను సమర్థంగా నిర్వహించేందుకు ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒక్కో సమావేశంలో నాలుగు నుంచి ఆరు గంటలపాటు చర్చించి భూముల విస్తీర్ణంలో తేడాలు, సరిహద్దు వివాదాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల అభ్యంతరాలను తెలుసుకున్నామని పేర్కొన్నారు. సర్వే సమయంలో భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు గుర్తించిన ప్రాంతాల్లో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యక్షంగా పాల్గొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినట్లు పొంగులేటి తెలిపారు. అవసరమైన చోట ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేందుకు మధ్యవర్తిత్వం చేయాలని సూచించామన్నారు. పైవేటు భూ వివాదాల్లో ప్రభుత్వం ఏకపక్షంగా జోక్యం చేసుకోకుండా న్యాయబద్ధంగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలను మాత్రం అధికారిక రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సర్వే చేపట్టే గ్రామాల్లో ముందుగానే చాటింపు ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తామని, సర్వే అనంతరం భూ యజమానులకు విస్తీర్ణ వివరాలు తెలియజేసి అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. న్యాయమైన అభ్యంతరాలుంటే తగిన సవరణలు చేస్తామని, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీసర్వే పూర్తయిన తర్వాత రైతులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన వాటర్‌ప్రూఫ్, మన్నికైన పాస్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని మంత్రి వెల్లడించారు. పాస్ పుస్తకంపై ఉండే ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సర్వే నంబరు, భూమి విస్తీర్ణం, భూమికి సంబంధించిన పటం తదితర వివరాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రతి భూ యజమాని భూముల వివరాలను మ్యాపింగ్‌తో అనుసంధానించి, ఒకే పాస్ పుస్తకంలో వివిధ సర్వే నంబర్లు, భూభాగాల వివరాలను ప్రత్యేక పేజీల్లో పొందుపరుస్తామని తెలిపారు. వ్యవసాయ భూములతో పాటు గ్రామాల్లోని నివాస స్థలాలు, ఇళ్లు, ఆబాదీ ఆస్తులకు కూడా సమగ్ర సర్వే నిర్వహిస్తామని, వాటికి మ్యాప్‌తో కూడిన గుర్తింపు పత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయ భూములకు ఒక రంగులో, ఆబాదీ ఆస్తులకు మరో రంగులో వేర్వేరు పాస్ పుస్తకాలు జారీ చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఒక్కో మండలానికి ఒక సర్వే యూనిట్ ఉండగా, ప్రస్తుతం రెండు యూనిట్లకు పెంచామని తెలిపారు. భూ రీసర్వే కేవలం భూములను కొలిచే కార్యక్రమం మాత్రమే కాదని, తరతరాలుగా కొనసాగుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నమని మంత్రి పేర్కొన్నారు. ప్రారంభ దశలో ఎదురైన సాంకేతిక, క్షేత్రస్థాయి ఇబ్బందులను అధిగమిస్తూ తదుపరి విడతల్లో మరింత వేగంగా సర్వే చేపడతామని చెప్పారు. ఇదే సమయంలో రాష్ట్రానికి ఇళ్ల కేటాయింపుల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి 13 లక్షల ఇళ్లు కావాలని కోరితే రెండు లక్షలు మాత్రమే మంజూరు చేశారని, గతంలో ఆంధ్రప్రదేశ్‌కు 17 లక్షల ఇళ్లు కేటాయించారని, తాజాగా కూడా తెలంగాణకు రెండు లక్షలు ఇవ్వగా ఏపీకి నాలుగు లక్షలు కేటాయించారని విమర్శించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటోందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వానికి కక్ష సాధింపు చర్యలు చేపట్టే ఉద్దేశం లేదని, ఏ నిర్ణయమైనా ఒక రోజు ఆలస్యమైనా శాస్త్రీయంగా, నిజాయితీగా తీసుకుంటామని పొంగులేటి స్పష్టం చేశారు. రైతులు, ప్రజాప్రతినిధులు, మీడియా సహకారంతో భూ రీసర్వేను పారదర్శకంగా పూర్తి చేస్తామని తెలిపారు.

మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

హైదరాబాద్, నవంబర్ 27

: హైదరాబాద్‌లోని మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సింధూజ అలియాస్ తుషారిక (36) మృతి చెందారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఆమె నివాసంలో విగతజీవిగా కనిపించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రాథమికంగా ఆత్మహత్యగా భావిస్తున్నప్పటికీ, మృతికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సింధూజ పదేళ్ల క్రితం భర్తతో విడాకులు తీసుకున్నట్లు సమాచారం. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా నివసిస్తున్నట్లు తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆమె వ్యక్తిగత పరిస్థితులు, ఇటీవల ఎదుర్కొన్న సమస్యలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. గత నాలుగు నెలలుగా మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఆ ఒత్తిడికి గల కారణాలు ఏమిటి, ఆమె ఎదుర్కొన్న సమస్యలేమిటనే విషయాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. సూసైడ్ నోట్‌లోని వివరాలను పోలీసులు పరిశీలిస్తూ, ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగిస్తున్నారు.నవంబర్ 26వ తేదీన సింధూజకు ఓ స్నేహితుడు ఫోన్ చేసినప్పటికీ ఆమె స్పందించలేదని తెలిసింది. పలు మార్లు ప్రయత్నించినా ఫోన్‌కు సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చినట్లు సమాచారం. అనంతరం ఘటన వెలుగులోకి వచ్చింది. ఆమె నివాసానికి చేరుకున్న వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ విషయం బయటపడింది. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని తదుపరి వైద్య పరీక్షల నిమిత్తం తరలించి, ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నారు. సూసైడ్ నోట్‌లోని అంశాలు, స్నేహితులు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

విద్యుత్ రంగానికి కేంద్ర సహకారం కోరిన భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ నిల్వ వ్యవస్థలను అభివృద్ధి చేయడం తమ ప్రాధాన్యాలని వివరించారు.

పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ఎస్) కింద తెలంగాణకు సంబంధించిన రూ.25,096 కోట్ల ప్రతిపాదనలకు 60 రోజుల్లోగా ఆమోదం ఇవ్వాలని భట్టి విక్రమార్క కోరారు. ఈ పథకం అమలుకు గడువును 2028 మార్చి వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున సాధ్యాసాధ్యాల అంతర నిధులు అందించాలని, రాష్ట్రానికి చెందిన కల్లూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో 2,000 మెగావాట్ గంటల సామర్థ్యంతో బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థల ఏర్పాటుకు కేంద్ర సహకారం అందించాలని ప్రతిపాదించారు. విద్యుత్ ప్రసార వ్యవస్థల అభివృద్ధిలో భాగంగా రాయ్‌గఢ్-పుగలూర్-త్రిసూర్ అధిక వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ) కారిడార్‌కు జాతీయ హోదా కల్పించాలని కోరారు. ఈ కారిడార్‌కు సంబంధించిన 6,000 మెగావాట్ల సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రత్యేకంగా సహకరించాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ మొదటి దశలో 23,480 ఎంవీఏ సామర్థ్యానికి సంబంధించిన పనులకు ఆమోదం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 400 కేవీ సెడమ్-పరిగి విద్యుత్ లైన్, మహేశ్వరం 2 సబ్‌స్టేషన్ నిర్మాణానికి జాతీయ స్థాయిలో వ్యయ భాగస్వామ్యం కల్పించాలని కోరారు. అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీలను హేతుబద్ధీకరించాలని, పునరుత్పాదక విద్యుత్ ప్రసార ఛార్జీల నుంచి 2030 మార్చి వరకు మినహాయింపు ఇవ్వాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. 2027 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన గ్యాస్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని, దానికి సంబంధించిన వ్యయాన్ని కేంద్రం, రాష్ట్రాలు భాగస్వామ్య పద్ధతిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ డిమాండ్ పెరిగే సమయంలో గ్యాస్ ఆధారిత కేంద్రాల ద్వారా ఉత్పత్తిని కొనసాగించేందుకు ఈ సహకారం అవసరమని వివరించారు.

రాష్ట్ర యాజమాన్యంలోని పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సహకరించే విషయంలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినందుకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ విద్యుత్ రంగ అభివృద్ధికి అవసరమైన కేంద్ర అనుమతులు, నిధులు, విధానపరమైన మద్దతు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించడం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడం, స్థిరమైన విద్యుత్ భవిష్యత్తును నిర్మించడం తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న జైల్‌భరో

- **దేశవ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలని సీపీఐ పిలుపు**
- **నల్లగొండలో జిల్లా కౌన్సిల్ సమావేశం**
- **ప్రజావ్యతిరేక విధానాలపై పల్లా వెంకటరెడ్డి విమర్శలు**



నల్లగొండ, నవంబర్ 27

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబర్ 1న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరసన కార్యక్రమాల ద్వారా బలంగా వినిపించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ ఆందోళనలో కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శుక్రవారం నల్లగొండలోని మగ్దూమ్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పల్లా వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై పార్టీ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల గురించి వివరించారు. దేశవ్యాప్తంగా ఒకే రోజున నిర్వహించనున్న జైల్‌భరో ద్వారా ప్రజల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యమంలో భాగంగా ముందుకు తీసుకురావాలని సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. పార్టీ శ్రేణులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను కలుసుకుని డిసెంబర్ 1న జరిగే ఆందోళనలో భాగస్వాములు కావాలని కోరాలని నాయకులు సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. ఇదే సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సాగర్ కుడి కాలువ నీటి తరలింపు అంశాన్ని ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, తెలంగాణకు సంబంధించిన నీటి హక్కులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

కోదాడ నియోజకవర్గంలో భూముల రీ-సర్వేకు సన్నాహాలు

- పారదర్శకంగా, పక్కాగా సర్వే నిర్వహించడమే లక్ష్యం.. అధికారులకు ఆర్డీవో దిశానిర్దేశం





కోదాడ, నవంబర్ 27(భద్రాద్రి న్యూస్): కోదాడ నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా రీ-సర్వే విధివిధానాలు, భూముల కొలతలు, హద్దుల గుర్తింపు, భూ రికార్డుల పరిశీలన, సర్వే వివరాల నమోదు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, లైసెన్స్డ్ సర్వేయర్లు, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు. భూముల రీ-సర్వే సమయంలో అనుసరించాల్సిన విధానాలు, క్షేత్రస్థాయిలో భూముల కొలతలు చేపట్టే పద్ధతులు, సరిహద్దుల గుర్తింపు, అందుబాటులో ఉన్న భూ రికార్డుల పరిశీలన, సర్వే వివరాల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సూర్యనారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న భూముల రీ-సర్వేను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. భూముల కొలతలు, హద్దుల గుర్తింపు, రికార్డుల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, సర్వే, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రీ-సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో కోదాడ తహసీల్దార్ సంతోష్ కిరణ్, చిలుకూరు తహసీల్దార్ ధ్రువకుమార్, అనంతగిరి తహసీల్దార్ కమలాకర్, మునగాల తహసీల్దార్ సరిత, నడిగూడెం తహసీల్దార్ ఎల్. మంగ, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామపంచాయతీ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు ఉజ్వల భవిష్యత్తు ముద్దు

- భేటీ బచావో ' భేటీ పడావో, ప్రతి ఒక్కరూ పాటించాలి

- క్రాంతి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ రవికుమార్



వైరా, నవంబర్ 27, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ స్థానిక ఎస్ ఆర్ ఠాగూర్ విద్యా సంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బేటి బచావో ' బేటి పడావో ' నినాదంతో విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా జిల్లా మహిళా సాధికారత యూనిట్ జనరల్ స్పెషలిస్ట్ 6 వాసంతి పాల్గొని మాట్లాడుతూ 0-18 సంవత్సరాల ఆడపిల్లలకు వివాహం చేయటం చట్టరీత్యా నేరం అని అదే విధంగా 0-21 సంవత్సరాల మగ పిల్లలకు వివాహం చేయటం చట్ట రిత్యా నేరమని, అలా జరిగినప్పుడు హెల్ప్ లైన్ నెంబర్ 10 98 కు సమాచారం అందించగలరని, అదేవిధంగా ఫోక్సో 2012 చట్టంలో ఉన్న విషయాలను వివరించడం జరిగింది. వీటివల్ల మధ్యలోనే విద్యను ఆపివేయటం, ఆరోగ్యానికి హాని కలగటం, పేదరికం కొనసాగటం లాంటి పరిస్థితులు నెలకుంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా అధ్యాపకులకు పోక్సో చట్టం 2013 గురించి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ పి ఓ లింగారావు, నాగలక్ష్మి, కల్పన, మజీద్, వేణు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుంది

- వైరా మండలం సిరిపురం గ్రామంలో మూడు కోట్ల రూపాయలతో నిర్మాణం పనులు

-ఎమ్మెల్యే రాందాస్ నాయక్

- పేద ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్





వైరా, నవంబర్ 27, (భద్రాద్రి న్యూస్) :
వైరా నియోజకవర్గ మండల సిరిపురం గ్రామంలో శుక్రవారం మూడు కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని, పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వృద్ధులకు, వికలాంగులకు, పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసా, సంక్షేమ పథకాలు అందించి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వేలకోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని అన్నారు. అనంతరం వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో వరి పంట సాగుకు నీరు అందించి పంటలు పండే విధంగా కృషిచేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను స్థానిక రైతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం సర్పంచ్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మచ్చ వెంకటేశ్వరరావు, బుర్ర రాజశేఖర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, నాయకులు మట్టూరి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాదేపాడు అభివృద్ధికి సర్పంచ్ రంజిత్ కుమార్ చొరవ..

బోడ్రాయి సెంటర్‌లో నూతన వీధి దీపం ఏర్పాటు!

- సింగరేణి సీఎస్ఆర్ నిధులతో వెలుగులు..

మిగతా కూడళ్లలోనూ విడతల వారీగా లైట్ల ఏర్పాటు: సర్పంచ్



కారేపల్లి, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్ -- రాములు): గ్రామ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా గాదేపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా గాదేపాడు గ్రామపంచాయతీ పరిధిలోని బోడ్రాయి సెంటర్‌లో సింగరేణి సీఎస్ఆర్ నిధులతో మంజూరైన నూతన వీధి దీపాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, ఉపసర్పంచ్ నన్నెబోయిన ఉపేందర్ చేతుల మీదుగా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన కూడళ్లలో రాత్రివేళ ప్రజలకు చీకటి ఇబ్బందులు లేకుండా, రాకపోకలకు సౌకర్యంగా ఉండటంతో పాటు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా బోడ్రాయి సెంటర్‌కు వీధి దీపాన్ని మంజూరు చేయించడంలో సహకరించిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు గాదేపాడు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని మిగతా ప్రధాన కూడళ్లలోనూ విడతల వారీగా వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ గాదేపాడు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పేదింటి సొంతింటి కలకు శ్రీకారం.. రేగులగూడెం అభివృద్ధికి సర్పంచ్ మోతి వీరస్వామి, అడ్డగోడ ఐలయ్య భరోసా!

- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం.. గ్రామానికి అదనపు నిధులు తీసుకొచ్చి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి





కారేపల్లి, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్ -- రాములు): నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య అన్నారు. శుక్రవారం రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీసం మోతి వీరస్వామి, అడ్డగోడ ఐలయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్డగోడ ఐలయ్య మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

రేగులగూడెం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గ్రామపంచాయతీకి అదనపు నిధులు తీసుకొచ్చి రేగులగూడెంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని అడ్డగోడ ఐలయ్య తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని, సర్పంచ్ వీసం మోతి వీరస్వామి ఆధ్వర్యంలో పాలకవర్గం సమష్టిగా పనిచేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారిలో ప్రతి కుటుంబం నుంచి ఒకరి పేరును నమోదు చేయించుకోవాలని, అర్హత మేరకు రూ.5 లక్షల జీవిత బీమా ప్రయోజనం పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం, రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లు తదితర సంక్షేమ పథకాలు అందని అర్హులు రెండో విడతలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉచిత విద్యుత్ పథకం ప్రయోజనం పొందని అర్హులు కూడా దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పొందాలని కోరారు.

కొబ్బరికాయ కొట్టి ఇళ్ల ప్రారంభోత్సవం

అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఈసం సుక్కారావు, ఇరఫా సంపత్ కుటుంబాల నూతన గృహాల వద్ద సర్పంచ్ వీసం మోతి వీరస్వామి, అడ్డగోడ ఐలయ్య తదితరులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభోత్సవం నిర్వహించారు. సొంతింటి కల నెరవేరుతున్న నేపథ్యంలో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొక్క వెంకటేశ్వరరావు, బొర్రా స్వామి, ఇరప నరసింహారావు, చెవుల భద్రయ్య, చీమల రాములు, శంకర్, రవి, బక్కయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా నమోదుకు సర్పంచ్ రంజిత్ కుమార్ శ్రీకారం..

- గాదేపాడు ప్రజలకు రూ.5 లక్షల భరోసా!

- అర్హులైన కుటుంబాలకు జీవిత బీమా రక్షణ..

గ్రామస్థాయిలో ఆన్‌లైన్ నమోదు ప్రారంభం



కారేపల్లి, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్ -- రాములు): గాదేపాడు గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరువ చేయడంలో సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గురువారం గాదేపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. గ్రామపంచాయతీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ పథకంలో నమోదు చేసుకునేలా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, ఉషా, విజయ్, సంజీవరావు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సర్పంచ్ టోనీ చొరవతో ప్రతి ఇంటికీ సంక్షేమ భరోసా..

అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా!

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన.. ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం





కారేపల్లి, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్ -- రాములు): గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా కారేపల్లి గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకంలో అర్హులైన ప్రతి కుటుంబం నమోదు చేసుకోవాలని సూచించారు. పథకం అర్హతలు, నమోదు విధానం, అవసరమైన వివరాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా బాధ్యతగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, మైనారిటీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాసేవలో నిబద్ధతకు గుర్తింపు.. కారేపల్లి సీఐ నునావత్ సాగర్‌కు ప్రశంసా పత్రం!

- విధి నిర్వహణలో అంకితభావం..

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ..

ఖమ్మం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా సత్కారం

కారేపల్లి, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్ -- రాములు):
విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావంతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో చూపుతున్న చొరవకు కారేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నునావత్ సాగర్‌కు పోలీస్ శాఖ నుంచి గుర్తింపు లభించింది. ఆయన సేవలను గుర్తించిన ఖమ్మం పోలీస్ కమిషనర్ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. కారేపల్లి పోలీస్ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందిస్తూ, బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో సీఐ సాగర్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్య ప్రజల సమస్యలను ఓపికగా ఆలకిస్తూ, వారికి తగిన న్యాయం జరిగేలా చట్టపరిధిలో చర్యలు చేపడుతున్నారు. కేసుల దర్యాప్తులో వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే లక్ష్యంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, బాధితులకు భరోసా కల్పించడంలో తనదైన చొరవ చూపుతున్నారు. పోలీస్ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ఆయన చేస్తున్న కృషికి ఉన్నతాధికారుల ప్రశంసలు దక్కడం విశేషం. విధి నిర్వహణలో కనబరిచిన సేవలకు లభించిన ఈ ప్రశంసా పత్రం సీఐ నునావత్ సాగర్‌కు మరింత బాధ్యతతో ప్రజలకు సేవలందించేందుకు ప్రోత్సాహంగా నిలవనుంది. ఈ సందర్భంగా సీఐ సాగర్‌కు పోలీస్



అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పట్టభద్రుల ఓటరు జాబితాపై ప్రత్యేక ప్రచారం

- **అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**
- **ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు**
- **నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు దరఖాస్తుల స్వీకరణ**
- **ముసాయిదా జాబితాపై అభ్యంతరాల నమోదుకు అవకాశం**



ములుగు, నవంబర్ 27
: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు జాబితా నూతన రూపకల్పన ప్రక్రియలో భాగంగా జిల్లాలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్డ్డే హేమంత్ సహదేవ రావు తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు నమోదయ్యేలా ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ తేదీ ప్రాతిపదికన రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించి, దానిపై దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాల్సిన అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాపై నవంబర్ 25వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు దరఖాస్తులు, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. నిర్ణీత గడువులోగా అర్హత కలిగిన పట్టభద్రులు తమ దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. ఇప్పటికే ముసాయిదా జాబితాలో నమోదైన వివరాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని కూడా ఈ గడువులోగా తెలియజేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
జిల్లాలో చేపట్టనున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ద్వారా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. అర్హత ఉన్నప్పటికీ ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించడంతో పాటు, ముసాయిదా జాబితాలోని వివరాలను పరిశీలించాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయనున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి ఓటరు జాబితా నూతన రూపకల్పనలో అర్హులైన పట్టభద్రుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. నవంబర్ 1, 2026ను అర్హత తేదీగా పరిగణించి రూపొందించిన ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరించనున్న నేపథ్యంలో అర్హులైన వారు ఈ ప్రక్రియను గమనించి తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

కమలాపూర్‌లో వెట్టిచాకిరీకి గురైన ఎనిమిది కార్మిక కుటుంబాలకు విముక్తి

- **కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రత్యేక చొరవతో స్వగ్రామాలకు తరలింపు..**
- **మరోసారి మోసపోవద్దని బాధితులకు సూచన**

హనుమకొండ,నవంబర్27
: ఉపాధి కోసం స్వగ్రామాలను విడిచిపెట్టి వందల కిలోమీటర్ల దూరం వలస వచ్చిన ఎనిమిది కార్మిక కుటుంబాలు వెట్టిచాకిరీ కోరల నుంచి విముక్తి పొందాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఓ సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో ఏళ్లుగా యజమాని చేతిలో మోసపోతూ, అరకొర కూలీతో బానిసలుగా జీవిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మిక కుటుంబాలకు శుక్రవారం స్వేచ్ఛ లభించింది. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రత్యేక చొరవతో బాధితులకు విముక్తి కల్పించడంతో పాటు వారి స్వగ్రామాలకు సురక్షితంగా చేరుకునేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
వెట్టిచాకిరీకి గురవుతున్న కార్మికుల సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. బాధితులు పనిచేస్తున్న ప్రాంతానికి అధికారుల బృందాన్ని పంపించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణలో గత కొన్నేళ్లుగా ఇటుకల తయారీ కేంద్రం యజమాని శివకుమార్ కార్మికులకు అరకొర కూలీ చెల్లిస్తూ వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో బాధిత కుటుంబాలకు విముక్తి కల్పించే చర్యలు చేపట్టారు.
అనంతరం బాధిత కార్మిక కుటుంబాలను హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు తీసుకురాగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వారితో ప్రత్యేకంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. పేదరికం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడే వ్యక్తులను మరోసారి నమ్మి ఇబ్బందులు పడవద్దని సూచించారు. వేరే ప్రాంతాలకు వెళ్లి ఇలాంటి వెట్టిచాకిరీ పనుల్లో చిక్కుకోవద్దని, స్వేచ్ఛగా పనిచేసుకుంటూ గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని హితవు పలికారు. పిల్లల భవిష్యత్తు బాగుండేలా వారిని తప్పనిసరిగా చదివించాలని, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.
వెట్టిచాకిరీ అనేది చట్టవిరుద్ధమైన చర్య అని, కార్మికుల హక్కులను హరించే ఇలాంటి దోపిడీని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్మికులను వెట్టిచాకిరీకి గురిచేసిన సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రం యజమాని శివకుమార్‌పై చట్టప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్‌ను ఆదేశించారు. అదేవిధంగా కార్మికులు పని చేసిన రోజులకు సంబంధించిన వేతనాలు చట్టప్రకారం అందేలా చర్యలు చేపట్టాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు.
మండలస్థాయి బృందం నివేదిక, క్షేత్రస్థాయి విచారణ ఆధారంగా ఆర్డీఓ జారీ చేసిన వెట్టిచాకిరీ విముక్తి ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ బాధిత కార్మికులకు అందజేశారు. అనంతరం బాధితుల స్వస్థలమైన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి కార్మిక కుటుంబాలకు విముక్తి కల్పించిన విషయాన్ని వివరించారు. హనుమకొండ నుంచి ప్రత్యేక వాహనంలో వారిని స్వగ్రామాలకు పంపిస్తున్నట్లు సమాచారం అందించారు.
బాధిత కుటుంబాలు సురక్షితంగా స్వగ్రామాలకు చేరుకునేందుకు ప్రత్యేక వాహనంతో పాటు ప్రయాణంలో అవసరమైన భోజన సదుపాయాలు, చిన్నారులకు పాలు, ఇతర అవసరమైన ఏర్పాట్లు అధికారులు కల్పించారు. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీలో మగ్గిన తమకు విముక్తి కల్పించి, స్వగ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారులకు బాధిత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓ వెంకటేష్, కమలాపూర్ తహసీల్దార్ సురేష్ కుమార్, సహాయ కార్మిక అధికారి షర్ఫుద్దీన్, ఇతర శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపునకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

- **'యూత్ ట్రాన్స్‌ఫర్మేషన్ మిషన్'లో భాగంగా కార్యక్రమం**
- **'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ**
- **ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా**
- **తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం**



ఆదిలాబాద్, నవంబర్ 27
: ఆదిలాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల కోసం వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' సంస్థ ఆధ్వర్యంలో 'యూత్ ట్రాన్స్‌ఫర్మేషన్ మిషన్'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో వ్యక్తిత్వ వికాసానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని 'యూత్ ట్రాన్స్‌ఫర్మేషన్ మిషన్'లో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించడం ప్రత్యేకతను సంతరించుకుంది. జ్యోతి ప్రజ్వలన అనంతరం కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది సమక్షంలో శిక్షణ కార్యక్రమం కొనసాగింది. యువతలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస అంశాలపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లలిత కుమారి, లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డి, రంజిత్, సుధాకర్ పాల్గొన్నారు. వీరితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణలో సంబంధిత ప్రతినిధులు పాల్గొని సహకరించారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి అభివృద్ధికి తోడ్పడే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' సంస్థ ఆధ్వర్యంలో 'యూత్ ట్రాన్స్‌ఫర్మేషన్ మిషన్'లో భాగంగా ఆదిలాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా పాల్గొని ప్రారంభించడం విద్యార్థులకు ప్రోత్సాహాన్నిచ్చే అంశంగా నిలిచింది.



వేలాది మందితో కలిసి నడిచిన కేంద్ర మంత్రి





- **మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం కొనసాగుతున్న కిషన్ రెడ్డి పాదయాత్ర**
- **యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద భారీగా పాల్గొన్న ప్రజలు**
- **పద్మశ్రీ అవార్డు గ్రహీత బీవీఆర్ మోహన్ రెడ్డి సంఘీభావం**
- **2029 నాటికి మాదకద్రవ్యాల రహిత భారత్ లక్ష్యం**



హైదరాబాద్, నవంబర్ 27
: మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పాదయాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. శుక్రవారం యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్దకు చేరుకున్న పాదయాత్రలో వేలాది మంది పాల్గొన్నారు.మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం, మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రజలను భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పం స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి జరుగుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 2029 నాటికి మాదకద్రవ్యాల రహిత భారత్ సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సందేశమిచ్చారు. ఈ పాదయాత్రలో ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత బీవీఆర్ మోహన్ రెడ్డి కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తుల ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, సామాజిక జీవనంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజలు ఒకే లక్ష్యంతో పాదయాత్రలో పాల్గొనడం ద్వారా ఈ సందేశాన్ని మరింత మందికి చేరవేయాలని నిర్వాహకులు భావిస్తున్నారు. నవంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట నుంచి ప్రారంభమైన యాత్ర నగరంలోని పలు ప్రాంతాల మీదుగా కొనసాగి జూబ్లీహిల్స్‌లో ముగియనుంది. చివరి రోజు సత్యం థియేటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు, ఇందిరానగర్ చౌరస్తా మీదుగా జూబ్లీహిల్స్ వైపు సాగింది. వివిధ ప్రాంతాల్లో ప్రజలతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు చేయడం, అవగాహన కల్పించడం కార్యక్రమంలో భాగంగా చేపట్టారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత సమస్యగా మాత్రమే కాకుండా కుటుంబాలు, యువత భవిష్యత్తు, సమాజ భద్రతకు సంబంధించిన అంశంగా మారుతోందని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు. వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత హైదరాబాద్, తెలంగాణ, భారత్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కిషన్ రెడ్డి కోరారు.